అన్నదాత వెత

అకాల వర్షాలు, వరుస తుఫాన్లు రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. ప్రస్తుతం ధాన్యం ధరల పరిస్థితి దయనీయంగా ఉంది. ఖరీఫ్ కంటే ముందుగా వర్షాలు కురవడంతో రైతులు ఆనందంగా వరి నారుమడులు సిద్ధం చేసి నాట్లు వేశారు. ఒకవైపు యూరియాతో యుద్ధం చేస్తూనే మరోవైపు పక్క చేను రైతు కంటే రెండు బస్తాలు ఎక్కువగానే పండించేందుకు అహర్నిశలు కృషి చేశారు. పంట గింజ దశ నుంచి వరుస తుఫాన్లు.. అకాలవర్షాలు రైతుల ఆశలను ఆవిరి చేశాయి. ఏటా 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది అకాల వర్షాలతో గింజలు నేలపాలై 25 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి రావడంతో రైతుల్లో నైరాశ్యం అలుముకుంది.

● నంద్యాల ఎడ్యుకేషన్, (ఆంధ్రజ్యోతి)

కల్లాల్లో ఆరబోసిన ధాన్యం



● ఈ ఏడాది తగ్గిన వరి ధాన్యం దిగుబడి
● మద్దతు ధర లేకపోవడంతో నష్టాలు
● రైతులను నట్టేట ముంచిన అకాల వర్షాలు
● కల్లాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు
● ఆశలన్నీ రబీ పైనే

ధరల్లోనూ వ్యత్యాసాలు

అరకొర పంట వచ్చినా ధర ఏ మాత్రం గిట్టుబాటు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధరపై పౌరసరఫరాల శాఖ రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఎక్కువగా వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,369 (100కిలోలు)లకు కొనుగోలు చేసినా రైతుల ఖాతాల్లో నగదు జమకావడం ఆలస్యం అవుతుందనే భయం ఒకటి కాగా, బయటమార్కెట్‌లో ధాన్యం, రకాలను బట్టి ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.500 నుంచి రూ.700 వరకు ఎక్కువగా వస్తుండడంతో రైతులు వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. కొందరు వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటుతో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి గోదాములకు తరలిస్తున్నారు.

జిల్లాలో 6,05,803 మెట్రిక్ టన్నుల దిగుబడి

నంద్యాల జిల్లాలో ఖరీఫ్‌లో 2,30,782 ఎకరాల్లో వరిపంట వేశారు. ఎకరాకు సరాసరి 25 నుంచి 27 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే వ్యవసాయాధికారుల అంచనా మేరకు 6,05,803 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. రైతులు మాత్రం అకాలవర్షాలతో పంట భారీగా దెబ్బతిందని, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 70 కిలోల బీపీటీ రకాల వడ్ల బస్తా రూ.1400 ఉండగా ఈ ఏడాది రూ.1450 నుంచి రూ.1500ల ధర ఉంది. అయితే కర్నూలు సోనా వడ్ల బస్తా గతేడాదికి ఈ ఏడాదికి పెద్దగా తేడా లేదు. రూ.1500 నుంచి రూ.1550 వరకు విక్రయిస్తున్నారు. ఇక నంద్యాల సోనా రకం రూ.1750 నుంచి రూ.1800ల వరకు విక్రయిస్తున్నారు. ఇదే రకం వడ్లు రెండేళ్ల క్రితం 70 కిలోల బస్తా రూ.2400 వరకు విక్రయించారు. గత ఏడాది నుంచి వరి పంట ఎక్కువగా వేయడంతో ధరలు పతనమయ్యాయని అధికారులు చెబుతున్నారు. రైతుల కొంతమేర ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం వల్ల ధరల్లో ఇంత వ్యత్యాసం ఉండదంటున్నారు.



ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు

వర్షాలు నట్టేట ముంచాయి



ఈ ఏడాది అధిక వర్షాల ప్రభావంతో దిగుబడి బాగా తగ్గింది. ఐదు ఎకరాల్లో వరి వేశాను. ఎకరాకు 28 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. అందులో నేను కౌలుకు తీసుకున్న భూయజమానికి ఎకరాకు 15 బస్తాలు కౌలు ఇవ్వాలి. ఇక మాకు మిగిలింది ఎకరాకు 13 బస్తాలు మాత్రమే.- దాట్ల వెంకటేశ్వర్లు, రైతు

తెగుళ్లు కూడా చుట్టుముట్టాయి



ఈ ఏడాది వర్షాలతో పాటు తెగుళ్లు కూడా అధికమయ్యాయి. నేను 1.25 ఎకరాల్లో బీపీటీ రకం వరి వేయగా 35 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. గతంలో ఒక్క ఎకరాకు 35 నుంచి 38 బస్తాలు దిగుబడి వచ్చేది. ఈ ఏడు నష్టమే.

- రామకృష్ణ, రైతు, బొల్లవరం



ధర లేదు



నాకున్న ఎకరా పొలంలో ఈ ఖరీఫ్‌లో కర్నూలు సోనా వరి వేశాను. దిగుబడి అంతంతమాత్రమే ఉన్నా ధర కూడా లేకపోవడంతో నష్టాలను ఎదుర్కొంటున్నాం. రెండేళ్ల క్రితం కర్నూలు సోనా వడ్ల బస్తాను రూ.2400 అమ్మేశాను. ఈ ఏడాది రూ.1500కే అడుగుతున్నారు.

● జయన్న, రైతు, గోపవరం

యాగంటి ఆలయ చైర్మన్‌గా బండి మౌళీశ్వరరెడ్డి



బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా యాగంటిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు బండి మౌళీశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఆలయ చైర్మన్‌గా బండి మౌళీశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా పి.శ్రీరాములు, రామశేఖర్, సుశీలమ్మ, సురేశ్, మంజులాదేవి, తిరుమలయ్య, ఏ.రాజేశ్, ఎం.జయలలిత, బి.సువర్ణ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు మహేశ్‌శర్మలను నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. త్వరలో పాలకవర్గసభ్యుల ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా తనకు యాగంటి ఆలయ పాలకమండలి కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి బండి మౌళీశ్వర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 14 నియోజకవర్గాల్లో అనధికారింగా ఉన్న లేఅవుట్లు, ప్లాట్లకు నోటీసులు ఇచ్చామన్నారు. మంత్రాలయంలో అనేక లాడ్జీలు నిర్మించారని తనిఖీకి వెళ్లి యజమానులను అనుమతులు ఎవరు ఇచ్చారంటూ ఆరా తీశామన్నారు. పంచాయతీ అనుమతి కేవలం ఇంటి నిర్మాణం కోసమే ఉంటుందని, వాణిజ్య సముదాయాలకు కుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని ఆయన స్పష్టంచేశారు. భవనాలు నిర్మించి కమర్షియల్‌గా వాడుకుంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ అనుమతి తీసుకున్న వారందరూ కుడా కార్యాలయానికి వచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ స్వయంగా తీసుకోకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని సోమిశెట్టి హెచ్చరించారు.

యాంటీ బయాటిక్స్‌తో జాగ్రత్త

● కర్నూలు కలెక్టర్ సిరి
● పేదలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం : ఎమ్మెల్యే గౌరు చరిత
● రూ.2.78 కోట్లతో డ్రగ్ కంట్రోల్ ఆఫీస్, ల్యాబ్ ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాంటీ బయాటిక్స్‌ను పరిమితికి మించి వాడరాదని, వైద్యుల ప్రిస్కిప్షన్లు లేకుండా మందులు అమ్మరాదని కర్నూలు కలెక్టర్ సిరి హెచ్చరించారు. మంగళవారం విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కర్నూలు, విశాఖపట్నం రీజనల్ లేబొరేటరీలు, డిప్యూటీ డైరెక్టర్ ఏడీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమీపంలో నూతనంగా రూ.2.78 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన డిప్యూటీ డైరెక్టర్, జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీస్ రీజనల్ లేబొరేటరీ భవనాలను కలెక్టర్ డా.ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ఔషధ దుకాణాల యజమానులతో మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన మందులను అమ్మరాదని సూచించారు. యాంటిబయాటిక్స్‌ను అధిక మోతాదులో ప్రజలు వాడుతున్నారని, దీని వల్ల రోగ నిరోధక శక్తి క్షీణించి ఇతర రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగా పేద ప్రజలకు రూ.25 లక్షల వరకు ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రతి అనారోగ్య సమస్యకు మందులు వాడకుండా, ప్రకృతిపరంగా జబ్బును నయం చేసుకోవడం మంచిదన్నారు. అనంతరం రీజనల్ ల్యాబ్‌ను కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ పరిపాలన డిప్యూటీ డైరెక్టర్ నాగకిరణ్ కుమార్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిహరతేజ, డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, డీసీహెచ్‌ఎస్ డా.జఫ్రుల్లా, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు హనుమన్న, జయరాముడు పాల్గొన్నారు.



డ్రగ్ కంట్రోల్ ఆఫీసును ప్రారంభిస్తున్న కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే

ఖాతా వివరాలిస్తే కటకటాలే.. 6

సమస్యల వలయంలో **జీజీహెచ్**
● స్థాయి పెంచారు.. వసతులు మరిచారు
● భర్తీకాని పోస్టులు
● అవస్థలు పడుతున్న రోగులు 6

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : సింగిల్ డెస్క్ ద్వారా అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించి, నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు వచ్చిన అర్జీలను తిరిగి పంపకుండా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆర్ కృష్ణాపురంలోని హస్తకళల స్టోన్ మర్చెంట్‌లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం నాలుగు కొత్త ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. పీఎంఈజీపీ కింద కేటాయించిన 137 లక్ష్యాలలో కేవలం 59 మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలినవి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సాయం కల్పించాలని బ్యాంకర్లను కోరారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీ సబ్సిడీ తదితర పథకాల ద్వారా జిల్లాలో 9యూనిట్లకు రూ 35.41 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కమిటీ ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ మహబూబ్‌బాషా, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పురోగతి పెంచాలి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకంలో జిల్లాలో అంచనా మేరకు పురోగతి సాధించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె డీఈఈలు, ఈఈలతో పీఎం సూర్యఘర్ పథకంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెండర్ ఎంపిక పూరైన దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. తక్కువ శాతం పురోగతి కనబరుస్తున్న మండలాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అభ్యర్థులకు అవసరమైన రుణ సహాయం బ్యాంకుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్, ఎల్డీఎం రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాపై సందిగ్ధం..



మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

● ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడుతో మంత్రి నిమ్మల భేటీ
● నేడు రెవెన్యూ మంత్రి అనగానితో సమావేశం
● ఆదోని బంద్‌కు పిలుపునిచ్చిన ప్రజాసంఘాలు

కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా ఏర్పాటు గురించి మంగళవారం విజయవాడలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో జరిగిన జిల్లా నాయకుల భేటీ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. ఆదోని జిల్లా ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. జిల్లా ఏర్పాటు చేయాల్సిందే అంటూ ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదోని జిల్లా సాధన అనే డిమాండ్ పశ్చిమ ప్రాంత ప్రజల సెంటిమెంటుగా మారింది. రిలే నిరాహారదీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు ర్యాలీలు వంటి నిరసనలతో ప్రజా ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు సీఎం చంద్రబాబును కలిసి ప్రజల ఆకాంక్షను వివరించారు. ఇప్పటికే ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి ఆదోని జిల్లాతో పాటు నియోజకవర్గాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రజా ఆందోళనల ఉధృతం నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్థానిక నాయకులతో చర్చించాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన నిమ్మల రామానాయుడుకు సూచించారు. అందులో భాగంగానే మంగళవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కే. మీనాక్షి నాయుడుతో ఇన్‌చార్జి మంత్రి అయిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల ఆదోని జిల్లా ఏర్పాటు పై సుదీర్ఘంగా చర్చించారు. ఏర్పాటు ఆవశ్యకత, వనరులు, స్థానిక పరిస్థితులు, నైసర్గిక స్వరూపం తదితర అంశాలను నిమ్మల అడిగి తెలుసుకున్నారు. అదే క్రమంలో ఎన్నికల ముందుగానీ, ఆ తర్వాత అంతకుముందు కూటమి ప్రభుత్వం గానీ, కూటమి పార్టీలు గానీ ఏమైనా హామీలు ఇచ్చాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి, ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆదోని జిల్లా సాధన ఉద్యమం ఉధృతం అవుతున్న తీరు వివరించారు.

మిగతా 6వ పేజీలో

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.07 కోట్లు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,06,81,661 నగదు వచ్చినట్లు ఏఏవో మాధవ శెట్టి మఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. మంగళవారం గురు రాజ్యాంగన భవనంలో నవంబరు, డిసెంబరు నెలల్లోని 21 రోజుల హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య లెక్కించారు. ఈ నగదుతో పాటు 23 గ్రాముల బంగారం, 490 గ్రాముల వెండి, వివిధ దేశాల విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ఈ లెక్కింపులో అనంతపురానిక్ జేపీ స్వామి, కృష్ణమూర్తి, సుజ్ఞానేంద్ర గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి కోసం



నంద్యాల డీఆర్‌డీఏ కార్యాలయం

● డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జీవనోపాధులకు యూనిట్ల మంజూరు
● దరఖాస్తు చేసుకున్న అందరికీ రాయితీ రుణాలు

నంద్యాల టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీనమైన మహిళలు కుటుంబ అవసరాల నిమిత్తం ఏళ్ల తరబడి అడుగడుగునా ఇబ్బందులు పడుతున్నారు. అయితే తాజాగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు అందిస్తున్న రాయితీ రుణాలతో కూడిన యూనిట్ల ఏర్పాట్లు మహిళల జీవితాల్లో బలమైన పునాదులు వేస్తున్నాయి. డ్వాక్రా మహిళలు ఆర్థిక భరోసాతోపాటు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. ఇందుకు గ్రామ సభలు నిర్వహించి పాడి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు కోళ్ల తదితర యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ ఆధారంగా పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, స్త్రీ నిధి రుణాలు అందించనున్నారు.

జిల్లా వివరాలు ఇలా ఉన్నాయి

నియోజకవర్గాలు........07
స్వయం సహాయక సంఘాలు....30600
మహిళా సభ్యులు...390409
మండల సమాఖ్యలు...29
గ్రామ సమాఖ్యలు...1086

రాయితీ ఇలా..

● రూ.లక్ష విలువ చేసే యూనిట్‌కు రూ.35 వేలు రాయితీ, రూ.65 వేలు బ్యాంకు రుణం ఇస్తారు.

● రెండు ఆవులు, రెండు గేదెలు, మేకల యూనిట్లకు షెడ్డుతో కలిపి రూ.2లక్షలు కాగా రూ.75వేలు రాయితీ వస్తుంది. రూ.1.25 లక్షలు అప్పుగా ఇస్తారు.

● బేకరీల ఏర్పాటుకు పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్‌కు విలువ రూ.2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుంది.

● వ్యవసాయ పరికరాలు వరికోత యంత్రం, రోటావేటర్ రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటాయి. వీటికి రూ. లక్ష 35 వేల వరకు రాయితీ అందజేస్తున్నారు.



ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి

యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ యూనిట్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం. అలాగే బ్యాంకు రుణాలు కూడా త్వరగానే మంజూరు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి.

● శ్రీధర్‌రెడ్డి డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల జిల్లా



సైబర్ కేటుగాళ్లు రోజురోజుకూ కొత్త విధానాలతో రెచ్చిపోతున్నారు. కరెంటు అకౌంటు వివరాలు ఇస్తే కమీషన్ ఇస్తామని ఆశచూపి మోసాలు చేస్తున్నారు. వీరి మాయలో పడి వివరాలు ఇస్తే జైలుకు వెళ్లాల్సిందే. సైబర్ నేరాలపై పోలీసులు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ కేటుగాళ్లు ఏదో విధంగా అమాయకులను మభ్యపెట్టి మోసాలకు పాల్పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటమే దీనికి పరిష్కారం.

ఖాతా వివరాలిస్తే కటకటాలే..

● కమీషన్ ఆశ చూపుతున్న సైబర్ నేరగాళ్లు ● గతంలో భారీగా లావాదేవీలు జరిపిన వారిపైనే గురి ● సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'మీ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే.. ఇందులో జమయ్యే డబ్బులకు మీకు కమీషన్ ఇస్తాను. నీపేరుతో కరెంటు ఖాతా ఓపెన్ చేసి వివరాలు ఇవ్వు నీకు ప్రతినెలా జీతంలా కొంత మొత్తం చెల్లిస్తాను' ఈమాటలు నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చావో ఎప్పుడో ఒకప్పుడు కటకటాలు లెక్కించాల్సిందే. సైబర్ నేరగాళ్లు అమాయకులకు కమీషన్ ఆశ చూపి వారి ఖాతాలను వాడుకుంటూ నేరాల ఉచ్చులోకి లాగుతున్నారు. ఇటీవల నంద్యాలలో కొన్ని కేసులు నమోదైనట్లు సైబర్ పోలీసులు తెలుపుతున్నారు.

మ్యూల్ అకౌంట్

నేరస్థులు తమ డబ్బును అక్రమంగా దాచడానికి, తరలించడానికి ఉపయోగించే ఖాతాను మ్యూల్ అకౌంట్ అంటారు. మోసగాళ్లు వేరొకరి ఖాతాల్లోకి అక్రమంగా సొమ్ము మళ్లిస్తారు. ఖాతా ఇచ్చినందుకు కొంత మొత్తం కమీషన్‌గా వేస్తారు. ఇలా ఖాతాలు ఇచ్చి చాలా మంది మోసపోయారు. ఇలా నంద్యాలలో కేసులు నమోదు అయ్యాయి.

తప్పుడు పత్రాలు సమర్పించినా..

బ్యాంకులో ఒక అకౌంట్ తెరవాలంటే ఎంతో కష్టం. బ్యాంకు ఖాతా తెరిచే సమయంలో వ్యక్తి సిఫార్సు చేసే వ్యక్తి బ్యాంకుకు సరియైన పత్రాలతో వెళ్తే కానీ ఖాతా తెరవని బ్యాంకు ఉద్యోగులు. అలాంటిది చనిపోయిన వ్యక్తుల పేరుమీద, తప్పుడు పత్రాలు సమర్పించినా ఖాతా తెరుస్తున్నారనే ఆరోపణలున్నాయి. బ్యాంకు సిబ్బందిపై కూడా అనుమానం వస్తుందని సైబర్ పోలీసులు తెలిపారు.

ప్రజలకు అవగాహన..

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో, ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. ఓటీపీలు షేర్ చేయవద్దు.. కొత్త వారికి బ్యాంకు ఖాతాల వివరాలు తెలపకండి అంటూ ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారు. అయినా సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రజల్లో సైతం అవగాహన వస్తేనే ఇవి తగ్గుముఖం పట్టే అవకాశముంది.

నేరాల్లో చిక్కుకునే ప్రమాదం

జిల్లాలో ఇప్పటికే చాలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అనవసరంగా డబ్బులు వస్తాయంటే నమ్మి మోసపోవద్దు. దీంతో నేరాల్లో చిక్కుకునే ప్రమాదముంది. వీటితో మీ ఖాతాల్లోని డబ్బులు పోతాయి. ఎవరు కూడా కమీషన్లు, ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసపోవద్దు.

● గౌతమి, సీఐ, సైబర్‌క్రైం, నంద్యాల

ప్రస్తుతం స్తబ్దుగా ఉన్న..

గతంలో కరెంట్ బ్యాంకు ఖాతా ద్వారా భారీగా లావా దేవీలు జరిపి ప్రస్తుతం స్తబ్దుగా ఉంచిన వారి పైనే సైబర్ నేరగాళ్లు దృష్టి పెడుతున్నారు. మీ ఖాతాకు మా కంపెనీ నుంచి డబ్బు వస్తుందని, తమ సిబ్బంది ఖాతాల్లో జమ చేస్తే కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా సైబర్ వలలో పడిన వారి నుంచి ఈ ఖాతాలకు జమ చేసుకుని అక్కడినుంచి ఈ వివిధ ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. కమీషన్ వచ్చేస్తోంది అని మిన్నకుండిపోతే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

- నంద్యాలలోని ఎస్బీఐ కాలనీకి చెందిన వ్యక్తిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు టెలిగ్రాం యాప్ ద్వారా 100మందిని యాడ్ చేసి ప్రతిరోజు డబ్బులు ఇన్‌వేస్ట్ చేస్తూ వెయ్యికి రూ.1300 ఇస్తామని చెప్పి నమ్మించి రూ.10వేల వరకు తిరిగి ఇస్తారు. వారి ట్రాప్‌లోకి వెళ్లిన తర్వాత డబ్బులు మన ఖాతాలో వస్తున్నట్లు చూపిస్తారు. ఆ డబ్బులను విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేస్తారు. ఇదిలా ఉంటే అందులో 98 మంది వారికి సంబంధించిన వారే ఉంటారు. కేవలం ఇద్దరు మాత్రమే వేరే వ్యక్తులు ఉంటారు. ఇలా మోసపోయి రూ.1 లక్ష పోగొట్టుకున్నారు.
- ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వస్తువులు కొనుగోలు చేస్తే వారు మన వివరాలను హ్యాక్ చేసి మనకార్డులను, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేస్తారు. వేరే రాష్ట్రాల నుంచి ఈ వ్యవహారం నడుస్తుండటంతో అక్కడే కేసు నమోదు చేస్తున్నారు. బాధితులు ఇక్కడి నుంచి వెళ్లలేకపోవడంతో వారి ఖాతాలను బ్యాంకువారు ఫ్రిజ్ చేస్తున్నారు. ఇలా పట్టణానికి చెందిన ఒక బ్యాంకు కోచింగ్ విద్యార్థి మోసపోయారు. ఫిర్యాదు చేయలేదు.
- నంద్యాల రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.10వేలు రుణం తీసుకున్నారు. ఈమొత్తాన్ని నెల వ్యవధిలో రూ.2500 అదనంగా చెల్లించా లని తెలిపారు. ఖాతాలో సరిపడ మొత్తాన్ని వేసి ఉంచాడు. కానీ యాప్‌కు సంబంధించిన వారు కాకుండా సైబర్‌గాళ్లు మొత్తాన్ని కొట్టేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ పోలీసులు (ఫైల్)

ఈ ఏడాది కేసుల వివరాలు..

సైబర్ కేసులు	: 25
నష్టపోయిన నగదు	: రూ.12.7కోట్లు
ఫ్రిజ్ చేసిన మొత్తం	: రూ.3 కోట్లు
అవగాహన కార్యక్రమాలు	: 700

దైవమార్గంలో నడవాలి

● ఘనంగా 133 ఏళ్ల చర్చి వార్షికోత్సవం



మాట్లాడుతున్న నంద్యాల బిషప్ సంతోష్ ప్రసన్నరావు

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని, ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలని నంద్యాల జిల్లా బిషప్ రైట్‌రెవ సంతోష్‌ప్రసన్నరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 133 ఏళ్ల చరిత్ర కలిగిన చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్నారు. చర్చిలో క్యాండిల్‌లైట్ ఆరాధన, ఆలయ ప్రతిష్ట ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించారు. చర్చి విశిష్టత గురించి తెలియజేశారు. ఏసు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. శాంతియుత జీవనం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం బిషప్ సంతోష్‌ప్రసన్నరావు, దాసరి బాల సంతోష్ దంపతులను డీనరి చైర్మన్ ఫాదర్ చంద్రశేఖర్ సన్మానించారు. చర్చి వ్యవస్థాపకులు రెవ. రిచర్డ్ డెండిషవర్ట్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్, వాలీబాల్, సెటిల్, బ్యాట్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆళ్లగడ్డ, చాగలమర్రి డీనరి చైర్మన్లు ప్రసన్నకుమార్, చంద్రశేఖర్‌లు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర, ట్రెజరర్ నందం ఐజాక్, స్టీఫెన్, ఫాదర్లు విక్టర్, బెంజిమెన్, రవికుమార్, అనిల్, సువార్తయ్య, సురేష్, సంపత్, సంఘ పెద్దలు, ఆయా చర్చిల ఫాదర్లు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాక్రోస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

● అభినందించిన గ్రామస్థులు



జాతీయ స్థాయి క్రీడల్లో నాలుగో స్థానం సాధించిన ఏపీ రాష్ట్ర జట్టు

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5నుంచి 7వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ ల్యాక్రోస్ పోటీల్లో కోసిగి మండల క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఏపీ రాష్ట్ర జట్టు వరుసగా నాల్గవసారి మూడో స్థానం సాదించింది. ఈ జట్టుకు మండలంలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన హుసేన్ సాబ్ కెప్టెన్‌గా వ్యవహరించారు. అదే గ్రామానికి చెందిన క్రీడాకారులు శివాజీ, గోవిందు పాల్గొన్నారు. డి.బెళగల్ గ్రామం నుంచి ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడంపై మండల ప్రజలు, గ్రామస్థులు అభినందించారు.

డిగ్రీలో ఒకరు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) పరిధిలో మంగళవారం డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 221 మంద దరఖాస్తు చేసుకోగా 197 మంది పరీక్షలు రాశారు. ఒకరు మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబారు చేశామని పరీక్షల విభాగం అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 13న 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 80సీట్లకు 6,469 మంది విద్యార్థులు పోటీ పడనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, 13వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నాని వివరించారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ అడ్మిట్‌కార్డును పొందవచ్చని సూచించారు.

ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించాలి : కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిరి వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో వైద్యశాఖకు సంబంధించిన కీ-ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కీలక పనితీరు సూచికలు)పై వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాఖకు సంబంధించిన కీ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ అమలులో వంద శాతం పురోగతి సాధించాలన్నారు..ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు పురోగతి తీసుకుని రావాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. సీపీవో భారతి, డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చలానాలపై లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ చలానాలను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై మున్సిపల్ కోర్టు హాలులో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పెండింగ్ చలానాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ తీరుప మేరకు కక్షిదారులు, పోలీసులు సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన కోరారు. ఈ కేసుల పరిష్కారానికి ఎటువంటి ఖర్చు లేకుండా సత్వరంగా న్యాయాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జీలు అనిల్ కుమార్, అనూష, అపర్ణ, పట్టణ డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాపై సందిగ్ధం..

5వ పేజీ తరువాయి

రెవెన్యూ మంత్రి అనగానితో మరో భేటీ:

ఆదోని జిల్లా ఏర్పాటుపై మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో బుధవారం మరోసారి జిల్లా నాయకులు భేటీ కానున్నారు. ఈ భేటీలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడుతో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. సుదీర్ఘ చర్చల అనంతరం తుది నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేస్తారు. జిల్లా ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే.. జనవరి 1వ తేదీ నుంచి జనగణన చేపట్టనుండటంతో ఆదోని జిల్లా ఏర్పాటు సాధ్యమా.. ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకుంటుందాని పలువురు చర్చిస్తున్నారు.

శాస్త్రీయంగా మండల విభజన చేయాలి : ఆదినారాయణరెడ్డి

ఏ గ్రామ ప్రజలకూ ఇబ్బంది లేకుండా ఆదోని మండలాన్ని విభజన చేయాలని పెద్దహరివాణం మండల సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణరెడ్డి కోరారు. మంగళవారం కర్నూలులోని ప్రజా వైద్యశాల సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని మండలంలోని ఆరు గ్రామాలు, హొళగుంద మండలంలోని 6 గ్రామాలు, కౌతాళం మండలంలోని ఒక గ్రామం కలిపి 13 గ్రామాలతో మండలం ఏర్పాటు చేయాలని తాము మొదటి నుంచి డిమాండ్ చేశామని తెలిపారు. ప్రభుత్వం ఆదోని మండలంలోని 17 గ్రామాలతో పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, మిగిలిన 16 గ్రామాలు దీనిని వ్యతిరేకిస్తున్నట్లు ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మండలమైన ఆదోని మండలాన్ని ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా విభజన చేయాలని, సూదూర గ్రామాలను సమీప మండలంలోనే ఉంచాలని కోరారు. ప్రభుత్వం 13 గ్రామాలతో పెద్దహరివాణం మండలం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అదే క్రమంలో ప్రజా ఆకాంక్షను అర్థం చేసుకుని ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఆదోని బంద్

ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలను కలుపుతూ ఆదోనిని నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే ఆదోని జిల్లా సాధన సమితి, జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని బంద్‌కు పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య దుకాణాలు బంద్ చేయనున్నారు. వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛంద బంద్‌కు ముందుకు వచ్చినట్లు తెలుస్తుంది.



ఆదోని: ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణులు, కాంగ్రెస్ నాయకులు

ఈ సమావేశంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ అరుణ్, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న తదితరులు మాట్లాడుతూ ఆదోని జిల్లా ఏర్పాటు కోసం ప్రజలు మరింతగా పోరాడాలని వారు తెలిపారు.



నైపుణ్యాలను వెలికితీసేదే బాలోత్సవం

అట్టహాసంగా ప్రారంభం



మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి. పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేదే బాలోత్సవమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో 5వ కర్నూలు బాలోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా బాలోత్సవ కార్యక్రమం జెండాను బాలోత్సవ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ బాలోత్సవాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ సెల్‌ఫోన్ భూతానికి పిల్లలు బలైపోతున్నారన్నారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి మాట్లాడుతూ బాలోత్సవం ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి డి.. దనుంజయ, డా.మురళిధర్, డా.మధుసూదన్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా.అక్తర్ భాను, ప్రైవేటు విద్యాసంస్థల గౌరవాధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అద్యక్షుడు వాసుదేవయ్య, శ్రీలక్ష్మి స్కూల్ డైరెక్టర్ దీక్షిత్ పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, కథా, కవితా రచన పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

సమస్యల వలయంలో జీజీహెచ్

● స్థాయి పెంచారు.. వసతులు మరిచారు ● భర్తీకాని పోస్టులు ● అవస్థలు పడుతున్న రోగులు



నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన వైద్యశాల (జీజీహెచ్) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కొన్నేళ్ల నుంచి సమస్యలు పరిష్కారం కాక రోగులు అవస్థలు పడుతున్నారు. నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌గా స్థాయి పెంచారేకాని తగ్గట్టుగా వసతులు చేకూర్చక పోవడంతో రోగులు ఇబ్బందులకు గురిఅవుతున్నారు. జీజీహెచ్‌లో పోస్టులు భర్తీచేయాలంటే కర్నూలు నుంచి అనుమతి రావాల్సి ఉంది. 2022లో జీజీహెచ్‌గా స్థాయి పెంచినప్పటి నుంచి సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

సౌండ్ ప్రూఫ్ గదిని త్వరలోనే ప్రారంభిస్తాం



జీజీహెచ్‌లో ఓపీడీ విభాగంలో సౌండ్ ప్రూఫ్ గది సిద్ధంగా ఉంది. త్వరలోనే వినికిడి పరీక్షాయంత్రం (బేరా)ను ఏర్పాటుచేసి రోగులకు అందుబాటులోకి తెస్తాం. ఫిజియోథెరఫి భవనానికి జనరేటర్ కనెక్షన్‌ను త్వరలో ఏర్పాటుచేస్తాం. పోస్టుల భర్తీకోసం ప్రతిపాదనలు పంపాం. **- డా. మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్**

650 పడకలకు పెంచేందుకు..

ప్రస్తుతం 450పడకలున్న జీజీహెచ్ త్వరలో 650పడకలకు పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్థాయికి తగ్గట్టుగా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌ను, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు నేటికీ ఖాళీగానే ఉన్నాయి. ఫిజియోథెరఫీ భవనానికి జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ లేని సమయాల్లో అంధకారం నెలకొంటోంది. పక్కనే జనరేటర్ ఉన్నా కొన్ని నెలలనుంచి దాని వైర్ తెగి పోవడంతో ఇంతవరకు మరమ్మతులు చేపట్టే నాథుడేలేడు. జీజీహెచ్‌లో జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏలు)77పోస్టులు మంజూరుకాగా ప్రస్తుతం 40లోపే ఉన్నారు.

రూ.లక్షల విలువ చేసే పరికరాలున్నా..



ఉపయోగంలో లేని మిషన్లు

రక్తనిధి కేంద్రానికి లక్షలు విలువచేసే పరికరాలున్నా నిరుపయోగమే. కేవలం కాంపొనెంట్ మిషన్ లేకపోవడంతో దాదాపు 10మిషన్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఓపీ విభాగంలో అధికసంఖ్యలో రోగులు వస్తున్నా సరైన సిబ్బందిలేక ఓపీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. కార్డియాల జిస్టు లేకపోవడంతో హృద్రోగులకు తిప్పలు తప్పడంలేదు. అత్యవసర సమయంలో హృద్రోగులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు లేదా ప్రైవేట్ ఆస్పత్రుకు వెళ్లాలని సూచిస్తున్నారు. గత కొన్నేళ్లనుంచి వినికిడి పరీక్షాయంత్రం స్టోర్‌రూమ్‌లోనే పదిలంగా ఉంది. సౌండ్ ప్రూఫ్ గదిలేకపోవడంతో ఈ యంత్రం పక్కనబెట్టారు. ఈ యంత్రం విలువ దాదాపు రూ.5లక్షలుంటుంది. జిల్లా కేంద్రం కావడంతో జీజీహెచ్‌కు దాదాపు 1500మంది రోగులు నిత్యం చికిత్స కోసం వస్తున్నారు. రోగులకు అవసరమైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

తెగులు.. దిగులు

- తగ్గిన జాజి, మల్లెపూల దిగుబడి
- ఆందోళనలో రైతులు


చాగలమర్రిలో తెగుళ్లతో ఎండిన మల్లె తోట

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూల తోటలు సాగు చేసిన రైతులకు అడుగడుగునా అవాంతరాలు తప్పడం లేదు. ఓ వైపు తెగుళ్ల బెడద, మరో వైపు తుఫాన్ వర్షాలతో పూల రైతులు అవస్థలు పడుతున్నారు. చాగలమర్రి మండలంలో పూల సాగుకు పెట్టింది పేరు. 1,000 ఎకరాల్లో మల్లెపూల తోటలు, 600 ఎకరాల్లో సన్నజాజి పూల తోటలు సాగు చేశారు. వీటిని పలు మార్కెట్‌లకు విక్రయిస్తారు. ఇక్కడి నుంచి హైదరాబాదు, కర్నూలు, తిరుపతికి తరలిస్తారు. అధిక విస్తీర్ణంలో ఆయా గ్రామాల్లో మల్లె తోటలు సాగు చేశారు. పూల సాగు చేసే రైతులు ఎక్కువగా పండుగల సమయంలో లాభాలు గడిస్తారు. ఈ ఏడాది భారీ వర్షాల వల్ల మల్లెపూలు, జాజిపూల దిగుబడి భారీగా తగ్గింది ఎకరాకు 2 కేజీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల చెట్లు దెబ్బతిని నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలకు అందించే రాయితీ కూడా రావడం లేదని, తోటల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదని, తెగుళ్ల నివారణకు సలహాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

తెల్లదోమ, ఎర్రదోమ తెగుళ్ల ప్రభావం

ప్రస్తుతం తోటల్లో తెల్లదోమ, ఎర్రదోమ లాంటి తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మల్లె తోటల్లో ఎర్రమొగ్గ ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వీటి నివారణకు పలుమార్లు మందులు పిచికారీ చేస్తున్నా నియంత్రణ కావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

పంట దిగుబడి చేతికి అందాలంటే 6 విడతలుగా పిచికారీ చేయాల్సి వస్తుందన్నారు. వీటికి రూ.20 వేలు దాకా ఖర్చు వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అందిన పూల దిగుబడి మార్కెట్‌లో విక్రయాలతో సరి చూసుకుంటే లాభాలు ఆశాజనకంగా లేవని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం సీజన్ బట్టి మల్లె పూల ధర కిలో రూ.170, జాజిపూలు కిలో రూ.150 పలికాయి. నెలన్నర వ్యవధిలోనే కిలో మల్లెలు రూ.300 వరకు చేరి ఆ తర్వాత రూ.120 ధర పడిపోయింది. ప్రస్తుతం మల్లె పూలు, జాజిపూలు దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 2 కేజీలు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పూలను కోసే కూలీలకు కూలీకి ఇవ్వలేక అవస్థలు పడుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండటంతో కేజీ ధర రూ.800 నుంచి రూ.1,000 పలుకుతోంది. ధర ఉన్నా దిగుబడి లేక కూలీ డబ్బులు వచ్చే పరిస్థితి లేదని రైతులు విలపిస్తున్నారు. కూలీలకు కూలీ ఇవ్వలేక కొందరు తోటలను ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు దున్నేస్తున్నారు. మరి కొందరు గొర్రెలకు మేతగా విడిచి పెట్టారు. ఈ ఏడాది దిగుబడి లేక రైతులు నష్టాలపాలవు తున్నారు. ప్రభుత్వం మల్లెతోటలకు రాయితీలు కల్పించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.


జాజిపూలు కోస్తున్న కూలీలు

ప్రభుత్వం ఆదుకోవాలి



నాలుగెకరాల్లో మల్లెలు, జాజులు సాగుచేశా. గుత్త ఎకరాకు రూ.లక్ష. గత నెలలో కేజీ పూలు రూ.170 ధర పలికింది. ప్రస్తుతం దిగుబడి లేక నష్టపోతున్నాం. ఎకరాకు కేజీ పూలు మాత్రమే దిగుబడి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

● షబ్బీర్, రైతు, చాగలమర్రి

దిగుబడి రాక నష్టపోతున్నాం



3 ఎకరాల్లో జాజి, మల్లెపూలు సాగు చేశా. కౌలు రూ.3.50 లక్షలు. భారీ వర్షాలు తెగుళ్ల వల్ల దిగుబడి రాక నష్టపోతున్నాం. కూలీలకు కూడా రావడం లేదు. వర్షాల వల్ల దెబ్బతిన్న తోటలకు పరిహారం అందలేదు. తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు లేవు. పరిహారం అందించి ఆదుకోవాలి.

● ఉసేన్‌బాషా, కౌలురైతు, చాగలమర్రి

సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలి

- సీఎంను కలిసిన తుగ్గలి నాగేంద్ర


చంద్రబాబుతో తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన సీఐ సతీష్ కుటుం బానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం అండగా నిలవాలని రాష్ట్ర శాలి వాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. సోమవారం సీఎం కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పత్తికొండ చెందిన సీఐ సతీష్ మరణం వెనకాల ఎవరున్నా వదిలిపెట్టవద్దని, అతని మరణానికి కారకులైన వారిని శిక్షించాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన సీఎం చంద్రబాబు సతీష్ మరణం వెనకాల ఎవరున్నా వారిపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

సంజామల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భర్త కనిపించకుండా పోయాడని భార్య ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనమంగళవారం జరిగింది. నొస్సం గ్రామానికి చెందిన మేరీతో 2016లో కోవెలకుంట్ల మండలం కంపమళ్ల గ్రామానికి చెందిన శ్రీరాముల మధుకుమార్‌కు పెళ్లయింది. మధు కుమార్ ఆటో నడిపేవాడు. మేరీ కూలీ పనులకు వెళ్లేది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. మధు కుమార్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కూతురును, తనను పట్టించుకోకుండా తిరుగుతుండటంతో గత ఏడాదిగా మేరీ నొస్సం గ్రామంలోని తన తల్లి దగ్గర ఉంటోంది. గత కొద్ది కాలంగా అతని ఆచూకీ లేదని కంపమళ్లలో సమీప బంధువుల ద్వారా తెలుసుకొని మేరీ ఫిర్యాదు చేసినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నటు ఎస్.ఐ రమణయ్య తెలిపారు.


మధుకుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజోతి): మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని డోన్ పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వెలుగోడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు, బోయరేవుల గ్రామాల మధ్య ప్రవహించే గాలేరు నదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న బోయరేవుల వీఆర్‌వో మాబాష పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ సురేశ్ సిబ్బందితో చేరుకొని, మృతదేహాన్ని బయటకుతీశారు. శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడిది ప్రకాశం జిల్లా పాలమూరు గ్రామం అని తెలిసింది. ఈ ప్రాంతానికి ఎలా వచ్చాడు? ఎలా చనిపోయాడు? అనేది తేలాల్సిఉంది.

బైకు దొంగ అరెస్టు

- 42 ద్విచక్రవాహనాలు రికవరీ

కర్నూలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో బైకు దొంగను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. మంగళవారం త్రీటౌన్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పదిరోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో బైక్ కనబడకుండా పోవడంతో బాధితుడు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేయగా, హడావుడిగా వున్న వ్యక్తుల వాహనాలను అనంతపురం జిల్లా కక్కలపల్లికి చెందిన పోతుల జాన్(29) దొంగిలిస్తున్నట్లు గుర్తించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిచారు. 42 బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ శేషయ్య, ఎస్ఐ ఆశాలత, ఏఎస్ఐ గిడ్డయ్య, హెడ్ కానిస్టేబుల్ వాసు, రంగారావు, కానిస్టేబుల్స్ శేఖర్, నాగరాజు, కిషోర్ ఉన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్య మొబైల్స్ దుకాణంలో రూ.21 లక్షల మేర మోసం జరిగినట్లు కంపెనీ ఆడిటర్ రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. షోరూం మేనేజర్ రాఘవేంద్ర అసిస్టెంట్ మేనేజర్ తులసిరామ్ నాయక్ కంపెనీకి చెందిన వివిధ రకాల వస్తువుల బిల్లులు లేకుండా విక్రయించినట్లు ఆడిట్‌లో గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

కర్నూలు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డిపై రెండో పట్టణ పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. బుధవారపేట చెందిన చంద్రశేఖర్, శ్రీకాంత్ సంకల్‌బాగ్‌లో ఉన్న తమ మిత్రుడు రవిని కలిసేందుకు ఈ నెల 4న వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డి వీరిని చూసి బైక్‌తో ఢీకొట్టాడు. ప్రభుత్వం వచ్చాక టీడీపీలోకి వెళ్తారా.. అంటూ దాడి చేశాడు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు..

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామానికి చెందిన షేక్ షభాన బేగం తనను భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. భర్త మస్తాన్‌వలి, అత్త, మామలు తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తూ, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువతకిచ్చిన నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగర శివార్లలోని హ్యాంగౌట్ ఫంక్షన్ హాల్లో వైసీపీ నాయకుడు కాటసాని శివ నరసింహారెడ్డి అధ్యక్షతన చేపట్టిన యువతా మేలుకో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో యువతకు అలవికాని హామీలిచ్చిన కూటమి అధికారంలోకి రాగానే వారిని దారుణంగా మోసం చేస్తుందని ఆరోపించారు. కాటసాని శివ నరసింహారెడ్డి మాట్లాడుతూ యువత మేలుకోవాలని, మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన విమర్శించారు. మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో డీజిల్ దొంగలు

- లారీ యజమానుల గగ్గోలు

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డీజిల్ దొంగలు రెచ్చిపోతున్నారు. పార్కింగ్ చేసిన లారీలను లక్ష్యంగా చేసుకుని డీజిల్‌ను దొంగలిస్తున్నారు. దీంతో బాధిత లారీల యజమానులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలో పార్కింగ్ చేసిన లారీల్లోని డీజిల్ ట్యాంకుకు అమర్చి ఉన్న తాళాన్ని ధ్వంసం చేసి దర్జాగా డీజిల్‌ను తస్కరించారు. ప్రత్యేకించి మైనార్టీ కాలనీ, ఇస్లాంపేట, రైస్‌మిల్, నంద్యాల టర్నింగ్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉంచిన 9 లారీల్లో 1,500 లీటర్ల డీజిల్‌ను కొందరు దుండగులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. మంగళవారం విషయం తెలుసుకున్న లారీల యజమానులు ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు ఫిర్యాదు చేశారు.


అర్బన్ సీఐ రాముకు ఫిర్యాదు చేస్తున్న యజమానులు

బాధితులను అడిగి వివరాలు సేకరించిన పోలీసులు నిందితుల కోసం సీసీ కెమెరాల్లో పరిశీలిస్తున్నారు. ఏ చిన్న ఆధారం లభించినా డీజిల్ దొంగలను వదిలే ప్రసక్తే లేదని పోలీసులు వారికి భరోసా ఇచ్చారు. ఇదిలావుంటే ఇంతకాలం ఇళ్ల బయట పార్కింగ్ చేసిన బైకుల్లో నుంచి గుర్తు తెలియని దుండగులు రాత్రివేళల్లో పెట్రోల్‌ను ఎత్తుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం లారీల్లో నుంచే డీజల్‌ను దొంగలిస్తుండటంతో లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

పిల్లిగుండ్లలో డెంగీ

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో 20 ఏళ్ల వ్యక్తికి మంగళవారం డెంగీ సోకినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన వ్యక్తికి వారం రోజులుగా జ్వరం ఉండటంతో స్థానిక వైద్యుల దగ్గర చికిత్స చేయించు కున్నారు. అయినప్పటికీ జ్వరం తగ్గక పోవడంతో కర్నూలు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ డెంగీ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో మంగళ వారం పిల్లిగుండ్లకు జిల్లా మలేరియా అధికారి నూకరాజు, సబ్ యూనిట్ అఫీసర్ కృష్ణుడు, గ్రామాన్ని చేరుకొని గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తుని ఇంటి పరిసరాలలో దోమల నివారణ మందును పిచికారి చేయించారు.

ఇన్ గేట్‌లో కష్టమే

- 108 అంబులెన్స్‌కు దారి ఇవ్వని ఆటోలు
- పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ



దారిలేక ఆగిపోయిన అంబులెన్స్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లోనికి వచ్చే రోగులు ఆటోలతో ఇబ్బందిపడుతున్నారు. ఇన్ గేట్ వద్ద నిత్యం ఇష్టారాజ్యంగా ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారులు ఆక్రమించి ఉంటాయి. దీంతో రోగులు లోనికి వెళ్లాలంటే చాలాసేపు నిలిచి ఉండాల్సి వస్తున్నది. ఆసుపత్రిలోనికి అంబులెన్స్ వెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. మంగళవారం ఉదయం కర్నూలు జీజీహెచ్ ఇన్ గేట్‌లోనికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగితో 108 అంబులెన్స్ లోపలికి వెళ్లడానికి వచ్చింది. ఆ సమయంలో ఆటోలు, పండ్ల వ్యాపారులు అడ్డంగా ఆక్రమించుకోవడంతో అంబులెన్స్ లోపలికి వెళ్లలేకపోయింది. ఇన్‌గేటు వద్ద రెండు గేట్లలో ఒకటి మూసి, మరొకటి తెరిచి ఉంచడంతో ఇరుకుగా మారి లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది ఇన్‌గేటు ముందు ఒక్కరూ లేరు. ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అంబులెన్స్ రావడానికి చాలా సమయం పట్టింది. రోగి బంధువులు వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ అధికారులు ఇన్‌గేటు వద్ద ఉన్న రెండు గేట్లను తెరిచి ఉంచి ట్రాఫిక్‌ను, ఆటోలను నియంత్రించాలని రోగులు కోరుతున్నారు.



మెయిన్ గేటుకు అడ్డంగా నిలిపిన ఆటోలు

నేడు డిప్యూటీ సీఎం మాటామంతి

- జడ్పీ అధికారులు, ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో, అధికారులు ఉద్యోగులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ 'మాటామంతి' బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ నుంచి అధికారులకు సమాచారం అందచింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల వివిధ కేటగిరీలలో పదోన్నతి పొందిన అధికారులు, సిబ్బందితో ఆయన నేరుగా మాట్లాడనున్నారు. ఈ మేరకు సుమారు 17 మంది ఉద్యోగులు ఉమ్మడి జిల్లా నుంచి మాట్లాడేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

- పత్తి, ఆముదాలు, నగదు అగ్గిపాలు
- రూ. 5లక్షల ఆస్తి నష్టం


కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న వీఆర్వో

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాడు గ్రామంలో విద్యుదాఘాతంతో కుమ్మరి శ్రీనివాసులకు గుడిసె దగ్ధమైంది. దాదాపు రూ. 5లక్షల ఆస్తి అగ్నికి ఆహుతైంది. ఇంటి యజమాని శ్రీనివాసులు ఆయన భార్య, పిల్లలు కట్టు బట్టలతో మిగిలారు. వారం క్రితం తమ పొలంలో పండిన 8 క్వింటాళ్ల పత్తి, ఆముదాలను శ్రీనివాసులు గుడిసెలో నిల్వ చేసుకున్నాడు. సోమవారం శ్రీనివాసులు భార్య లలితమ్మ, కూతురు మల్లేశ్వరి ఊరి కి వెళ్లారు. మంగళవారం శ్రీనివాసులు, కుమారుడు ఓబులేసు మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఉదయం శ్రీనివాసులు మొక్క జొన్నకు నీరు కట్టేందుకు వెళ్లాడు. గుడిసెలో కుమారుడు ఓబులేసు ఒక్కరే ఉన్నారు. ఉదయం 8 గంటల సమయంలో గుడిసెలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో నిప్పురవ్వలు పత్తి పంటపై పడి మంటలు చెలరేగాయి. ఈ కారణంగా పత్తి, ఆముదాలు కాలి బూడిద అయ్యాయి. దీంతో పాటు ఇంట్లో ఉన్న వంట సామగ్రి, బట్టలు, నగదు డబ్బులు, తిండి గింజలు ఇతరత్రా సామగ్రి కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 5లక్షల మేర పంట నష్టం వాటినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపాడు. వీఆర్వో ఈశ్వరరెడ్డి సాయంత్రం కాలిపోయిన గుడిసెను పరిశీలించి నష్టం అంచనా వేసి నివేదిక ఉన్నతాధికారులకు పంపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె..

మహానంది: మహానంది సమీపంలోని ఈశ్వర్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. కాలనీకి చెందిన నాసరి రాజుకు చెందిన గుడిసెకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. బాధితులు గుర్తించే లోగానే గుడిసెలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితుని కుటుంబం కట్టుబట్టలతో బయట పడ్డారు. చుట్టు పక్కల ఉండే ప్రజలు గమనించి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రాజు కోరారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయాధికారి దివ్య

నందికొట్కూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నందికొట్కూరు జూనియర్ న్యాయాధికారి దివ్య సూచించారు. మంగళవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదుల తో సమీక్ష నిర్వహించారు. న్యాయాధికారి దివ్య మాట్లాడుతూ సివిల్ కేసులలో కక్షిదారులకు అవగాహన కల్పించి అప్పీలు లేని అంతిమ తీర్పును పొందవచ్చున్నారు. ప్రామిసరీ నోట్లు, ఎన్‌ఐ యాక్టు కేసులు, ఈపీ కేసులు, రాజీ అయ్యే ఇతర సివిల్, క్రిమినల్ తగాదాలు లోక్ అదాలత్‌లో రాజీ పడవచ్చన్నారు. న్యాయవాదులు సహకరించి జయప్రదం చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శరభయ్య, ఏజీపీ మహేశ్వరుడు, ఏపీపీ సుస్మిత, సీనియర్, జూనియర్ న్యాయవాదులున్నారు.

క్రీడాకారిణికి సైకిల్ అందజేత



క్రీడాకారిణికి సైకిల్‌ను అందజేస్తున్న అవుల నారాయణరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ.. అండర్ -17 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడాకారిణి మౌలాబీకి కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త అవుల వెంకట నారాయణరెడ్డి అత్యాధునిక సైకిల్‌ను అందజేశారు. మంగళవారం స్థానిక కళాశాలలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను చదివిన కళాశాల నుంచి క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. జనవరిలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. రూ.35వేల విలువ గల సైకిల్‌ను అందజేశారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌లో 980 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10వేల నగదు, కళాశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లయితే రూ.లక్ష విలువ గల కళాశాలకు అవసరమయ్యే సామగ్రిని అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు ఉన్నారు.

ఆలయంలో నిత్య పూజలు

శ్రీశైలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మహా క్షేత్రం ప్రధాన ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణలోని సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేక ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి అభిషేకాలు, పుష్పార్చనలు, అష్టోత్తర నామావళి, వీరశైవ ఖడ్గాలతో సాంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

హుండీ లెక్కింపు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో, ఈవో చంద్రుడు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. రూ.3,49,365లు వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో చలంబాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



డబ్బులను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

విద్యార్థుల శ్రమదానం

పాణ్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలూరులో ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. స్పెషల్ క్యాంపులో భాగంగా మంగళవారం వలంటీర్లు గ్రామంలోని చెత్తాచెదారం తొలగించారు. రహదారులు, మురుగుకాల్వలు శుభ్రం చేశారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల గొంతు వాపుపై నిర్లక్ష్యం చేయొద్దు

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల గొంతు వాపుపై నిర్లక్ష్యం చేయొద్దని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం దుద్యాల పశువైద్యశాలలో పశువులకు గొంతువాపు టీకాలు వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జనవరి 15 వరకు కొనసాగుతుందని చెప్పారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో ఆల్‌ది స్కై ఫౌండేషన్ అమెరికా వారి ఆర్థిక సహకారంతో డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ఏడుగురికి ట్రై సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో చైతన్య కళాభారతి సంస్థ అధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమకు సరైన సమయంలో విద్యుత్ సరఫరా కావడం లేదని, దీంతో పొలాలకు నీరందక పంటలు నష్టపోతున్నామని ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం గ్రామంలోని రైతులు హైవేపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో సుమారు గంట పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విత్తనాలు వేస్తున్న టైంలో విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని, మోటర్లు తరచూ కాలి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ రాము పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకుని సమస్య తెలుసుకున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రైతులు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం చేరుకుని ఈఈ జయశంకర్, డీఈ రామ సుబ్రహ్మణ్యంను కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

ప్రతి పనికో రేటు

- పైసల్ ఇవ్వనిది ఫైల్ కదలదు
- తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం
- దురుసుగా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నంద్యాల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పనులు కావాలంటే పైసల్ ముట్ట జెప్పాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు ఉద్యోగులు అయితే కార్యాలయానికి వచ్చే ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తున్నారు. నంద్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికీ ఓ రేటు పెట్టారు. ప్రజల్లో అసంతృప్తి వ్యక్త మవుతుంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫైల్ ముందుకు కదలాలంటే..

రేషన్ కార్డుల పని కోసం, ఎఫ్ఎంసీ(ఫ్యామిలీ సర్టిఫికెట్), రేషన్‌కార్డులో యాడింగ్ పాసు బుక్‌ల కోసం, పథకాల ధ్రువీకరణ కోసం ఏపని అయిన డబ్బులివ్వక పోతే ఫైల్ ముందుకు కదలడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పనుల కోసం కొందరు ఉద్యోగులు మధ్యవర్తులు, ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారి నుంచి సాయంత్రం వసూలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందుకు కొంత మంది ఉద్యోగులు సహకరించడంతో ఇదంతా జరుగుతుందని బహిరంగ ఆరోపణలున్నాయి. సచివాలయ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్కడ లాగిన్ చేయించుకుని ఇక్కడికి రావాలంటే ఇక్కడ ముడుపులు చెల్లించక తప్పడం లేదు.

దురుసు పదజాలంతో..

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కూడా ఫిర్యాదులు తీసుకుని వచ్చే వారిపై దురుసు పదజాలంతో సమాధానం చెబుతున్నాడు. ఇప్పటికే పలుమార్లు గొడవలు జరిగాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సమాచారం కోసం, ఫైల్ పరిస్థితి, ఈడబ్ల్యూఎస్, ఇన్‌కం, క్యాస్ట్, ఇలా సర్టిఫికెట్ల కోసం వారు ఫైళ్ల పరిస్థితి అడిగితే నాకు తెలియదు.. పని ఉంది మళ్లీ రా అని దురుసుగా సమాధానమిస్తున్నాడు. ఉన్నతాధికారుల లాగిన్‌లో ఓకే చేసినా కంప్యూటర్ ఆపరేటర్ మాత్రం ముడుపులివ్వనిదే పని చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తామనడంతో..

ఇటీవ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఉన్నతాధికారులు ఓకే చేశారు. 30రోజులు గడువులు ఉందని, తర్వాత చేస్తానని కంప్యూటర్ ఆపరేటర్ చెప్పాడు. ఏమి చేయాలో అర్థంకాక వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవడం లేదు. 28వ రోజు మళ్లీ వెళ్లి అడిగినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో అప్పుడు వెతికి ఓకే చేసినట్లు సమాచారం.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం



తహసీల్దార్ కార్యాలయాల్లో పనుల కోసం మధ్యవర్తులకు డబ్బులు ఇచ్చి నష్టపోవద్దు. నేరుగా కార్యాలయాలకు వెళ్లి పనులు చేయించుకోవాలి. ఒక వేళ కార్యాలయాల్లో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే విచారణ జరిపి అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

● చల్లా విశ్వనాథ్, ఆర్డీవో, నంద్యాల

వచ్చేనెలలో స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను జనవరి మూడవ వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్మీయట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు చేసిన యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో 60 మంది అభ్యర్థులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అగర్‌బత్తీల తయారీ, చీర తయారీ, పర్యాటక రంగానికి అనుసంధానమైన శిక్షణలు, సోలార్ పలకల అమరిక, డ్రోన్ మరమ్మత్తుల శిక్షణ వంటి కోర్సులను ప్రవేశ పెట్టాలని సూచించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజియన్ మేనేజర్ నరసింహారావ్, ఎల్డీఎం రవీంద్రకుమార్, డీఆర్డీఎ పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అక్రమ తరలింపు..?

నందికొట్కూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాలకు యూరియాను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సహకార సొసైటీ నుంచి పగిడ్యాల మండలం గణపురం గ్రామానికి యూరియ బస్తాలతో తరలి వెళ్తున్న ఆటో డ్రైవర్‌ను నందికొట్కూరులో ప్రశ్నించగా బ్రాహ్మణకొట్కూరు సొసైటీ నుంచి గణపురం గ్రామానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సహకార సొసైటీ పరిధిలోని రైతు యూరియా కోసం వెళ్లితే ఒక్కొక్క ఎకరాకు ఒక యూరియా బస్తా మొదలుకొని ఐదు బస్తాలు మించి ఇవ్వడం లేదు. కాని ఇతర మండలాలకు మాత్రం ఆటోల్లో పదుల సంఖ్యలో బస్తాలను సరఫరా చేస్తున్నారు. పట్టపగలు పదుల సంఖ్యలో ఆటోల్లో యూరియా బస్తాలు వెళ్తుంటే సంబంధిత అధికారులు బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. గత రెండు మూడు రోజుల క్రితం బ్రాహ్మణకొట్కూరు సొసైటీ నుంచే జూపాడుబంగ్లా మండలంలోని ఓ గ్రామానికి కూడా ఇలానే ఆటోల్లో యురియా బస్తాలు తరలించారని స్థానికులు చెబుతున్నారు. గత పది రోజులుగా బ్రాహ్మణకొట్కూరు పట్టపగలు పదుల సంఖ్యలో ఆటోల్లో తరలి వెళ్తున్నా మండల వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



బ్రాహ్మణకొట్కూరు సహకార సొసైటీ నుంచి యూరియా బస్తాలను తీసుకెళ్తున్న గణపురం ఆటో

ప్రజారోగ్య భద్రత కోసమే సర్వే

ఆత్మకూరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రజారోగ్య భద్రత కోసం ఆరోగ్య శాఖ ఎస్సీడీసీడీ 3.0 సర్వే నిర్వహిస్తోందని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. ఆశాలు ఇంటింటికి వెళ్లి పరీక్షల ద్వారా వ్యాధిగ్రస్థులను గుర్తించి ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సలు అందించాలని సూచించారు. మంగళవారం ఆయన బైర్లూటి పీహెచ్‌సీలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులను గుర్తించి చికిత్సలు అందించడం ప్రధాన లక్ష్యంగా ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. కీటక జనిత వ్యాధులు డెంగీ, మలేరియా ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేగంగా విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. అంతకుముందు ఆయన వైద్యాధికారులతో కలిసి అమలాపురం చెంచు గూడెంలో పర్యటించారు. ఫోకల్ స్ప్రే ద్రావణాన్ని నిలువ నీటిలో పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్‌కుమార్, సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, సూపర్‌వైజర్ రమణమ్మ, సబ్‌యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, ఆరోగ్య కార్యకర్త విశ్వనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు

రైతాంగంపై నిర్లక్ష్య వైఖరి సరికాదు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతాంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మొక్కజొన్న కంకులు, దెబ్బతిన్న వరి, పత్తి దిగుబడులు ఉంచి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న, వరి పంటలకు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసినా ఆచరణలోని నోచుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. మద్దతు ధరలను అమలు చేయకపోవడం వల్ల మధ్యదళారులు రైతులను దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇంతా జరుగుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మహెబూబ్‌బాషా, సుధాకర్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఖాజీకి నియామక పత్రం అందజేత



ఖాజీకి నియామక పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు రూరల్ ఖాజీగా పట్టణానికి చెందిన మహ్మద్ సైఫుల్లా రషీద్ నియమితులైయ్యారు. మంగళవారం ఎమ్మెల్యే జయసూర్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సంఘం నాయకులు ఎమ్మెల్యే జయసూర్యను, బ్రాహ్మణకొట్కూరు సొసైటీ సింగిల్‌విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డిని సన్మానించారు. టీడీపీ నాయకులు లాడెన్, అబ్దుల్‌రజాక్, పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని చెప్పారు. వివరాలకు 7673902328, 9154830286 నంబర్లను సంప్రదించాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం గాజులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు సుదర్శన్‌రెడ్డి, సునీల్‌కుమార్, ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు తోట కవిత, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

మిడుతూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుక దేవి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల బాలికలకు కలిగే నష్టాల గురించి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఫైజున్నిసా బేగం, మల్లికార్జున నాయక్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



రైతులతో మాట్లాడుతూ ఏవో నాగేశ్వరరెడ్డి

మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగులో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులు యూరియాకు బదులు నానో యూరియా ఉపయోగించాలని చెప్పారు. దీనివల్ల నేల, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మాధవ్, ఉద్యానవన అధికారులు మంజుల, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ప్రతులను గవర్నర్‌కు అందజేస్తాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నంద్యాల రూరల్ , డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల పత్రాలను ఈనెల 17న మాజీ ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పీపీ నాగిరెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఇంట్లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బుధవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పత్రాలను స్వీకరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేసి పేద విద్యార్థులకు సైతం వైద్య విద్య అందించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, నాయకులు సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గంగాదేవి ఉత్సవం



గంగాదేవికి బోనాలు సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

పాణ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగాదేవి ఆలయంలో మంగళవారం గంగమ్మ ఉత్సవం నిర్వహించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాణికేశ్వరస్వామి ఆలయ సమీపంలోని పగడబాయి ప్రాంతంలోని గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తిరిపాలు, పెద్దమద్దిలేటి, నడిపి మద్దిలేటి, చిన్న మద్దిలేటి, బుడ్డన్న, రజకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికులపై కేంద్రం ఉక్కుపాదం

పాణ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ రంగాలపై ఉక్కుపాదం మోపిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం పాణ్యంలో ఆటో వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్రం కార్మిక, ఉద్యోగ వర్గాలకు వ్యతిరేక చట్టాలు తెచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేశీకరణ, నాలుగు లేబర్ కోడ్స్, పనిగంటల పెంపు నిర్ణయాలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా ఈనెల31 నుంచి జనవరి 4వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి భాస్కర్, నాగరాజు, నారాయణ, మహబూబ్ బాషా, రాంసింగ్, గౌడ్, శివ, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

విద్యార్థినులకు ప్రశంసా పత్రాల అందజేత



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జానపద, నృత్య, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని టి. చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సెట్కూరు ఆధ్వర్యంలో జానపద, నృత్య, వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. కళాశాల విద్యార్థినులు అత్యంత ప్రతిభ కనబర్చారన్నారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు రమేష్‌కుమార్, నాగేంద్ర, నాగమురళీమోహన్, దాక్షమణి, నూర్జహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంధువులకు వృద్ధురాలి అప్పగింత

బండి ఆత్మకూరు/వెలుగోడు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలిని చేరదీసిన ఆశ్రమ నిర్వాహకులు పోలీసుల సహకారంతో బంధువులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎరుకల కాలనీకి చెందిన సుంకమ్మ వృద్ధురాలు సోమవారం రాత్రి వెలుగోడులో రోడ్డు వెంట తిరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కానిస్టేబుల్ ప్రసాద్ వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆమెను విచారించగా ఎరుకలకాలనీ అని చెప్పటం మినహా ఏమీ చెప్పలేకపోయింది. దాంతో స్థానిక ప్రొఫెసర్ రాయసం రత్నస్వామి ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమంలో చేర్చారు. ఆశ్రమ నిర్వాహకులు నంద్యాల చైతన్య కళాభారతి సంస్థ ప్రసిడెంట్ విజయభాస్కర్, వరలక్ష్మి, శ్రీనివాసగౌడ్, శేషాద్రి మంగళవారం ఉదయం ఆమెకు అల్పాహారం ఇచ్చినా, మధ్యాహ్నం భోజనం అందించినా తీసుకోలేదు. దాంతో పోలీసు ప్రసాద్ సహకారంతో ఎరుకలకాలనీలో వృద్ధురాలి వివరాలు సేకరించి ఆమె బంధువులకు అప్పగించినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు.



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దృశ్యం

బాలింతలకు పండ్లు పంపిణీ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జమాఆతే ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నంద్యాల జిల్లా ఆసుపత్రిలో మెటర్నిటీవార్డులో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. షుగర్ వ్యాధితో కాలు కోల్పోయిన మహబూబ్ బాషాకు రూ.12వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం బేగం అమ్తుసలాం, అవాజ్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సమద్, జమాత్ సభ్యులు మహమ్మద్ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రీడా మైదానాలు కబ్జా

- ప్రహరీలు లేక ఆకతాయిలకు అడ్డా
- విలువైన భూముల్లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడా మైదానాలు కబ్జాకు గురి అవుతున్నాయి. క్రీడా మైదానాల కోసం ఏళ్ల కిందట దాతలు భూములను విరాళంగా ఇచ్చారు. ఈ భూములను సైతం కొందరు అక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 42 మండల పరిషత్ పాఠశాలలు, 1 ఉర్దూ యూపీ పాఠశాలలున్నాయి. వీటిలో జడ్పీహెచ్ఎస్‌లకు చాలా వాటికి సరైన క్రీడా మైదానాలు లేవు. ఉన్న ఏళ్ల నాటి క్రీడా మైదానాలను ఆయా పాఠశాలల అధికారులు కాపాడుకోలేక పోతున్నారన్న విమర్శలున్నాయి.

ఐదు దశాబ్దాల కిందట..

ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఐదు దశాబ్దాల కిందట దాత ఏడు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఇందులో ఒక ఎకరా ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణానికి ఉపయోగించారు. మరో పది సెంట్ల స్థలంలో నీటి ట్యాంక్ నిర్మాణం చేస్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో క్రీడా మైదానం దక్షిణం వైపు నుంచి అక్రమణలు ప్రారంభమయ్యాయి.

ఏడెకరాలు ఇవ్వలేదని..

పాఠశాలకు స్థలం ఇచ్చిన దాత బంధువులు తాము ఏడెకరాలు భూమి పాఠశాలకు ఇవ్వలేదని, కేవలం 4 ఎకరాలు మాత్రమే ఇచ్చామని ఇంకా రెండు ఎకరాలకు పైగా భూమి తమకే ఇవ్వాలని స్థలాన్ని అక్రమించుకొంటున్నారు. ఆ ప్రదేశంలో ప్రస్తుత మార్కెట్ విలువ విపరీతంగా పెరిగిపోవడం ఎకరా కోటి రూపాయులు పలుకుతుండడంతో క్రీడా మైదానం స్థలం అన్ని వైపుల నుంచి అక్రమణలకు గురవుతుంది.

అప్పట్లో 17 ఎకరాలు ఉండేవి..

ఆళ్లగడ్డ పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఎద్దుల పాపమ్మ కళాశాల, ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పూర్వం 17ఎకరాలు ఉండేదని పెద్దలు చెబుతున్నారు. ప్రస్తుతం క్రీడామైదానం చాలా వరకు అక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రీడా మైదానంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకునే విద్యార్థులు వివిధ రకాల క్రీడలు అడుకుంటారు. ఈక్రీడామైదనంలో ఎంతో మంది క్రీడాకారులు సాధన చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన సంఘనలు ఉన్నాయి. ఈ క్రీడామైదానం అక్రమణకు గురికావడం తోపాటు ప్రభుత్వ భవనాలు కట్టడంతో చిన్నదిగా మారిపోయింది. పాఠశాలకు మొదటి నుంచి ప్రహరీ లేక అక్రమణలు జరిగినట్లు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని చాలా పాఠశాలలకు..

మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. పట్టణంలోని ఉర్దూ పాఠశాలకు ప్రహరీ కోసం రూ 1.3లక్షల కోసం ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఈ పాఠశాలలో గతంలో నాడు నేడు కింద రూ 20 లక్షలతో రెండో విడతలు పనులు చేశారు. దాదాపు 18లక్షలతో ఫర్నిచర్, మరుగుదొడ్లు, ఇతర పనులు పూర్తి చేశారు. ప్రహరిలేకపోవడంతో పాఠశాల సెలవు రోజుల్లో అకతాయిలు మరుగుదొడ్లు, నీటి కొళాయిలు ధ్వంసం చేశారు. వీటి పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ప్రహరీలు లేక విలువైన స్థలాలు అక్రమణలకు గురవుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉన్నత పాఠశాలలకు దాతలు కేటాయించిన పూర్వపు అస్తులను కొలతలు వేయించి తగు చర్యలు తీసుకొని ప్రహరీలు నిర్మించి క్రీడామైదానాలు కబ్జాకు గురి కాకుండా చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు.


పాలసాగరంలో అక్రమణకు గురైన ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానం

హెలిప్యాడ్ తొలగించాలి



పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల క్రీడా మైదానంలో ఏళ్ల కిందట నిర్మించిన హెలిప్యాడ్ స్లాబ్‌ను తొలగించాలి. క్రీడామైదానంలోని మధ్య భాగంలో అప్పట్లో హెలీ ప్యాడ్ నిర్మాణం సిమెంట్ స్లాబ్ వేయడంతో క్రీడాకారులకు చాలా అసౌకర్యంగా ఉంది.

● అఖిల్, జాతీయ క్రీడాకారుడు, ఆళ్లగడ్డ

నీటి కుంటలుగా మారుతున్న క్రీడామైదానం



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానం కొద్ది పాటి వర్షం పడినా నీటి కుంటలా మారుతుంది. క్రీడా మైదానంలో అక్కడక్కడా గుంతలు పడి పోవడంతో నీరు నిలిచి పోతుంది. ప్రహరీ లేకపోవడంతో ద్విచక్ర, ఇతర వాహనాలు తిరుగుతూ మైదానాన్ని గుంతల మయంగా మారుస్తున్నారు.

● విశ్వనాథ్, జాతీయ క్రీడాకారుడు, ఆళ్లగడ్డ

అరటి సాగులో మెలకువలు పాటించాలి


అరటి తోటను పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ హెచ్‌వో దస్తగిరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అరటి సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆళ్లగడ్డ ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి అన్నారు. 'అరటి రైతు కుదేలు' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. స్పందించిన ఆయన అరటి తోటలను పరిశీలించారు. ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు అరటిలో నాణ్యమైన దిగుబడి సాధించడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా ఫ్రూట్ యాక్టివిటీ కింద హెక్టారుకు రైతులకు రూ.25వేల వరకు సబ్సిడీ ఇస్తారన్నారు. తెగుళ్ల నివారణకు రైతులు బెలా ఇంజక్షన్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

బ్యాగు అప్పగింత

డోన్ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట్లవారిపల్లెకు చెందిన బోయ లక్ష్మీదేవి, ఆమె కుమారుడు కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు మంగళవారం కోట్ల వారిపల్లె సమీపంలో ఓ ఆటో ఎక్కి బేతంచెర్ల సర్కిల్‌లో దిగారు. బోయ లక్ష్మీదేవి బ్యాగ్ ఆటోలో మరిచిపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ ఆఫీసులోని కమాండ్ కంట్రోల్ రూములోని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఒక గంట వ్యవధిలోనే ఆటోను ట్రేస్ చేసి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితురాలికి బ్యాగును డీఎస్పీ శ్రీనివాస్ చేతుల మీదుగా అప్పగించారు. ఆ బ్యాగులో విలువైన వస్తువులు, నగదు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. గంట వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులకు డీఎస్పీ అభినందించారు.

ప్రైవేటీకరణ తగదు: వైసీపీ

డోన్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని వైసీపీ నాయకులు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం డోన్ వైసీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతమైందన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన సంతకాల సేకరణ ప్రతులను ఈ నెల 10న డోన్ పట్టణం కోట్ల వారి పల్లె మీదుగా భారీ ర్యాలీతో తీసుకుని జిల్లా పార్టీ కార్యాలయానికి చేరు స్తామన్నారు. వైసీపీ వలంటరీ విభాగపు జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, నాయకులు చిరంజీవి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం


గృహ మంజూరు పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

డోన్ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరానగర్ 16వ సచివాలయంలో నూతనంగా మంజూరైన నూతన గృహాల మంజూరు పత్రా లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, టీడీపీ నాయకులు జిలేబీ ధను, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ టైలర్ మధు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి


మృతిచెందిన పొట్టేళ్లను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

శిరివెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో పొట్టేళ్ల మందపై కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన మల్లికార్జునకు చెందిన పొట్టేళ్ల మందపై సోమవారం అర్ధరాత్రి కుక్కలు చేసిన దాడిలో ఐదు పొట్టేళ్లు మృతి చెందాయి. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. వైద్యులు దస్తగిరి, మనోరంజన్ ప్రతాప్ ఘటనాస్థలికి చేరుకుని గాయపడిన పొట్టేళ్లకు చికిత్స చేశారు. కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతిచెందడంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మల్లికార్జున కోరాడు.

పొట్టేళ్ల చోరీ - కేసు నమోదు

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో పొట్టేళ్ల చోరీ ఘటనకు సంబంధించి మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు వెల్లడించారు. గ్రామానికి చెందిన వెంకట కృష్ణారెడ్డి గ్రామ సమీపంలోని అబ్దులాపురం రహదారిలో రేకుల షెడ్డులో 18 పొట్టేళ్లు తోలుకొని ఉండగా, అందులో 4 పొట్టేళ్లు చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 2న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంవీ నగర్ కాలనీకి చెందిన జాన్సన్(60) కుమార్తె వివాహానికి, ఇంటి నిర్మాణానికి తీసుకున్న అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 2న విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఉపాధ్యాయులకు, భోజన నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని గోరుమానుకొండ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

● బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్ గ్రామంలో మంగళవారం ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోట్ల హాజరై పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యారంగంలోనే కాకుండా క్రీడారంగంలో కూడా చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ కన్వీనర్ బుగ్గన ప్రసన్నలక్ష్మీ, బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, మండల విద్యాధికారులు సోమశేఖర్, అబ్రహం, నాయకులు రాముడు, వాసు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కలెక్టర్ రాజకుమారిని కోరారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల రోడ్ల అభివృద్ధి, నీటి సరఫరా, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

● మండలంలోని చిన్నమల్కాపురం గ్రామ 16వ సచివాలయాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పింఛన్లు సకాలంలో లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే చిన్నమల్కాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఉన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న కోట్ల

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణికి పౌష్టికాహారం అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సొంత నిధులతో వంద మంది తల్లులకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనత, పోషకాహారంపై అవగాహన లేకపోవడంతో ప్రవస సమయంలో చాలామంది తల్లులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణులను ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సమ్మేళానానికి తరలి రావాలి


సీఐ రమేష్‌బాబుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆర్‌ఎస్ఎస్ ప్రతినిధులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో ఈనెల 15న జరిగే హిందూ సమ్మేళనానికి అందరూ తరలి రావాలని ఆర్‌ఎస్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌ఎస్ఎస్ జిల్లా నాయకులు దాసరి శ్రీనివాసులు, చంద్రశేఖరరెడ్డి, రాముడూనాయక్‌లు సీఐ మద్దినేని రమేష్‌బాబు, టీడీపీ మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రికల ను అందజేశారు. ఈకార్యక్రమానికి రాధాకృష్ణ మఠం పీఠాధిపతి పాందురంగానంద భారతీ స్వామిజీ, మాతాజీ రుక్మిణి భారతి, అనంతానంద భారతిస్వామి హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

బనగానపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్, ఎస్సీ, ఎస్టీ బీసీ బాలికల హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న బాలికలకు తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ రాజారెడ్డి బుధవారం దుప్పట్లు పంపిణీ చేయనున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పేదలకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎన్నో విద్యాసంస్థల్లో పనిచేసే విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశామ న్నారు. ప్రస్తుతం హాస్టల్ విద్యార్థులకు చలికాలం వస్తున్న సందర్భంగా ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ప్యాపిలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రహిమాన్ అన్నారు. మంగళవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో ఆయన ఆశా వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. రహిమాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అమలు చేయడం బాధకరమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేందుకు ఈ నెల 31 నుంచి జనవరి 4వరకు సీఐటీయూ అఖిల భారత మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్ర మంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, హుసేన్, మధు, ఆశావర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

బనగానపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం మండలంలోని బనగానపల్లెలోని కేజీఆర్ కళాశాలలో మత్తుపదార్థాలపై కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ గంజాయి, మద్యం, ధూ మపానం వల్ల ఆరోగ్యాలు చెడిపోవడమే గాక మరణం సంభవిస్తుందన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ సదాశివమూర్తి, అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, చెన్నప్ప, మహమ్మద్‌ఆలీ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయానికి ఓ భక్తుడు మంగళవారం విరాళం అందించారు. తణుకుకు చెందిన రాధాకృష్ణమూర్తి అనే భక్తుడు రూ.10వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఈవో పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కోవెలకుంట్ల డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 42 రేషన్ బియ్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సుబ్బరాయుడు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకుమారి, వీఆర్‌వోలతో కలిసి పట్టణంలోని గాంధీనగర్‌లో సుబ్బరాయుడు ఇంటిపై దాడి చేసి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 42 రేషన్ బియ్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, సుబ్బరాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

పౌష్టికాహారంతో తల్లీ బిడ్డలకు ఆరోగ్యం

దొర్నిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ వెంకటశివ అన్నారు. మంగళవారం దొర్నిపాడు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజన పథకం కింద గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు రవికుమార్, భార్గవ్, సంధ, విమల, సూపర్‌వైజర్ సాయికృప, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రుద్రవరం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్లు అమర్ నాథరెడ్డి, శ్రీజారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో పీఎం ఎస్ఎంఏ ప్రోగ్రాం కింద గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. అలాగే మండలంలోని ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 21న పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

డోన్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై డోన్ అగ్నిమా పక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలకు గల కార ణాలు, వాటిలో రకాలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణయ్య, డోన్ అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడు, ఫైర్‌మన్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న కమిషనర్

డోన్ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేట రేణుకా ఎల్లమాంబేశ్వరి అమ్మవారిని మంగళశారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈనెల 14న జరగబోయే హిందూ సమ్మేళనానికి హాజరు కావాలని ఆలయ నిర్వాహకుడు ఏఈ నాగరాజుగౌడు కమిషనర్‌కు కరపత్రాలు అందచేశారు. అలాగే ఆలయ పరిసరాల చుట్టూ ఉన్న కంపచెట్లు, ముళ్లపొదలను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ నాగరాజుగౌడు కమిషనర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ చిన్న రెహిమాన్, తాపీ మేస్త్రీ అసోసి యేషన్ నాయకులు లచ్చింపల్లి రామచంద్రుడు, ఓం నారాయణ, బీసీ సంక్షేమ సం ఘం అధ్యక్షుడు గోసానిపల్లి రాంబాబు, టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటు మల్లికా ర్జున పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీఎల్ ఎండీని కలిసిన ధర్మవరం

డోన్ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌ను మంగళవారం రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాఘవేంద్రరెడ్డి

ప్యాపిలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో కార్యకర్తలతో సమావేశా న్ని నిర్వహించారు. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకా లను అర్హులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కుడు మోహూరి రాము, సింగల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మోహూరి రామ క్రిష్ణ, రాజా నారాయణమూర్తి, సుదర్శన్, ఖాజాపీర్, రామ్‌కు మార్, మధు కుమార్, నాగేంద్ర, సూర్యనారాయణ పాల్గొన్నారు.

13న తిరుమలకు భక్తి చైతన్య పాదయాత్ర

కోవెలకుంట్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల పాదయాత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న కోవెలకుంట్ల నుంచి తిరుమలకు 4వ భక్తి చైతన్య పాదయాత్ర ప్రారంభమవుతుందని అధ్యక్ష, కార్యదర్శులు పి నాగరాజు, దామోదరాచారి, లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాదయాత్ర ఈ నెల 13 నుంచి ప్రారంభమై ఈ నెల 20వ తేదీ తిరుమలకు చేరుకుంటుందన్నారు. పాదయాత్రలో పాల్గొనేవారు ఏ విధమైన డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, వివరాలకు 9441137699 నెంబరును సంప్రదించాలని కోరారు.

మహిళలకు వరం.. స్త్రీశక్తి పథకం

చాగలమర్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు స్త్రీశక్తి పథకం వరం లాంటిదని ఆళ్లగడ్డ క్లస్టర్ పరిధిలోని శ్రీనిధి మేనేజర్ ఫరూక్, ఏపీఎం నాగమ్మ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2024-25లో 58 గ్రూపులకు శ్రీనిధి ద్వారా రూ.3 కోట్ల నిధులు అందించామన్నారు. 2025-26లో 294 మందికి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల ప్రకారం 45 గ్రూపులకు పంపిణీ చేశామన్నారు. వెలుగు సీసీలు పాల్గొన్నారు.

కమ్మేస్తున్న పొగమంచు


ఉదయం 7 గంటలకు లైట్లతో వెళ్తున్న వాహనం

ఉయ్యాలవాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో పొగమంచు కమ్మేస్తుంది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పొగమంచు కురిసింది. దట్టమైన పొగమంచు కురియడంతో కోవెలకుంట్ల - జమ్మలమడుగు జాతీయ రహదారిలో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన దారులు లైట్లు వేసుకొని వారి ప్రయాణాన్ని కొనసాగించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ఆళ్లగడ్డ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లింగం దిన్నే రస్తాలో ఉన్న గాస్పల్ సెంటర్ ప్రార్థన మందిరంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీపీటీడీ బిలీవర్స్ కాన్ఫరెన్స్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కూటమిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థలు చేశారు.

నేల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. మంగళవారం ఉయ్యాలవాడ గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మద్దిలేటి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడ టం వల్ల నేల సారవంతం తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో టెక్నాలజీ అసిస్టెంటు మేనేజర్ హరిక్రిష్ణ, ఎంఏవో శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రిన్సి పాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. మంగళవారం మండలంలోని మల్లేవేముల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల గ్రేడింగ్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.